ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.6 । కనిష్ఠం 28.4
7
కామారెడ్డి
జిల్లా వార్తలు
ఆదివారం 12 మే 2024



కాంగ్రెస్‌లో జోష్

- శ్రేణులను ఉత్సాహపరిచిన ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిలు
- ప్రియాంకగాంధీకి ఘనంగా స్వాగతం పలికిన ప్రజలు
- రోడ్‌షోకు భారీగా హాజరైన జనం
- మోదీ ఓటమి తెలంగాణ నుంచే ప్రారంభం కావాలి
- ప్రజల సంక్షేమం కోరేవాడు రాహుల్ లాంటివారు దేశానికి కావాలి
- కామారెడ్డిలో కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ
- సురేష్ షెట్కార్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కామారెడ్డి, మే 11(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల రోడ్‌షో, కార్నర్ మీటింగ్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఎన్నికల ప్రచారం చివరి రోజు చివరి సమయంలో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు అగ్రనేతలు తమ శైలిలో ప్రసంగం చేయడం కాంగ్రెస్ శ్రేణుల్లోనే కాకుండా కార్యక్రమానికి హాజరైన ప్రజలను సైతం ఉత్సాహపరిచారు. ప్రియాంకగాంధీ హిందీలో ప్రసంగిస్తు ప్రధాని మోదీ, బీజేపీ పాలనపై చురకలు వేయడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. నెలరోజుల పాటు ప్రచారం ఒక ఎత్తు అయితే చివరి రోజు, చివరి సమయంలో జరిగిన ఈ కార్యక్రమం కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తల్లో జోష్ నింపింది. తాండూర్ నుంచి ప్రత్యేక హెలిప్యాడ్‌లో ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిలు కామారెడ్డికి చేరుకున్నారు. కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం నుంచి కాన్వాయ్ ద్వారా ఇందిరాగాంధీ విగ్రహం చేరుకుని అక్కడ నుంచి రోడ్‌షోగా జేపీఎన్ రోడ్డు వరకు చేరుకున్నారు.

తెలంగాణ నుంచి మోదీ ఓటమి ప్రారంభం కావాలి

● ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ

ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ ఓటమి తెలంగాణ రాష్ట్రం నుంచే ప్రారంభం కావాలని.. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో రాష్ట్ర ప్రజలు ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటువేసి ఇండియా కూటమిని గెలిపించాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పిలుపునిచ్చారు. ఇప్పుడిప్పుడే దేశంలో మార్పు వస్తోంది. ప్రజలు సైతం మేల్కొంటున్నారు. బీజేపీ ప్రభుత్వం వద్దని, మోదీ పాలన అంతమొందించాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాల మోదీ పాలనలో ప్రజలకు మేలు జరిగింది ఏమి లేదన్నారు. అందుకే దేశాన్ని సుస్థిరంగా పటిష్టంగా ఉంచే సేవ చేసే ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె అన్నారు. 10 సంవత్సరాల బీజేపీ పాలనలో ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని ఏ ఒక్క వర్గానికి ఎలాంటి మేలు చేయలేదన్నారు.

మోదీ ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే మేలు జరిగిందని పేదలు మరింత ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. దేశ, పేద ప్రజల సంపదను ప్రధాని మోదీ తన మిత్రులకు దోచి పెట్టాడన్నారు. రైల్వే, పోర్టు, విమాన, విద్యుత్ కాంట్రాక్ట్‌లను ఆదాని, అంబానీలకే కట్టబెట్టారన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో తన మిత్రులకు చెందిన 16 లక్షల కోట్ల రుణాలను మోదీ మాఫీ చేశాడని ఆరోపించారు. కానీ దేశంలోని పేద ప్రజలకు, రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోదీ ఎప్పుడు కూడా దేశంలోని ప్రజలు, కులాలు, మతాల మధ్య విద్వేషాలు సృష్టించడమే లక్ష్యంగా పని చేశారే తప్ప దేశ అభివృద్ధికి పాటు పడలేదన్నారు. మరోసారి బీజేపీ గెలిచిన మోదీ ప్రధాని అయిన దేశంలో రక్షణ కరువవుతుందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ఇండియా కూటమి గెలువాలని ప్రజలను కోరారు. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి సురేష్ షెట్కార్ పోటీలో ఉన్నారని చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ ప్రజల కోసం యువనేత రాహుల్‌గాంధీ ఎంతో కష్టపడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ ఒక స్వచ్ఛమైన నాయకుడన్నారు. ప్రజల సంక్షేమం కోరేవాడని రాహుల్ లాంటి నేత దేశానికి అవసరమన్నారు.

సురేష్ షెట్కార్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలి

● రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ ఎన్నికలు ప్రధాని నరేంద్రమోదీ పరివార్, కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పరివార్ మధ్య జరుగుతున్న యుద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ పరివార్ అంటే ఈడీ, ఐటీ, సీబీఐ, ఢిల్లీ పోలీసులు, ఆదాని, అంబానీలు అని ఆరోపించగా రాహుల్‌గాంధీ పరివార్ అంటే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ, ప్రియాంకగాంధీ, కోట్లాది కాంగ్రెస్ కార్యకర్తలన్నారు. ఈ ఎన్నికల్లో మోదీ పరివార్‌ను ఓడించి రాహుల్ పరివార్‌ను గెలిపించాలని సీఎం కోరారు. కానీ రాహుల్‌గాంధీ మాత్రం దేశ రాజ్యాంగాన్ని రక్షించాలని, రిజర్వేషన్లను పెంచాలని కంకణం కట్టుకున్నారని అన్నారు. అందుకోసం రాహుల్‌గాంధీ 150 రోజుల పాటు కన్యకుమారి నుంచి కశ్మీర్ వరకు 4వేల కిలో మీటర్ల మేర మండుటెండల్లో మంచుకొండల్లో పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్నారని అన్నారు. అలాంటి రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చూడాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి సురేష్ షెట్కార్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని సీఎం ప్రజలను కోరారు. ఈ కార్నర్ మీటింగ్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత ఇంట్లో మద్యం, నగదు పట్టివేత

బీర్కూర్, మే 11: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు రాజు అనే బీఆర్ఎస్ నాయకుడి ఇంట్లో 25 లీటర్ల మద్యం బాటిళ్లు, 27వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు మద్యం, నగదు పంపిణీ చేస్తున్నారని సమాచారం మేరకు రాజు ఇంట్లో తనిఖీలు నిర్వహించామన్నారు. 25 లీటర్ల మద్యం బాటిళ్లతో పాటు 27వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్నూర్‌లో ఆర్మీ ఫోర్స్ కవాతు

మద్నూర్, మే 11: మండల కేంద్రంలో శనివారం సుమారు 110 మంది ఆర్మీ ఫోర్స్, స్థానిక పోలీస్ అధికారులు కవాతు నిర్వహించారు. మధ్యప్రదేశ్ ఆర్మీ ఫోర్స్ మేజర్ రాందీర్ సింగ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. వివిధ వర్గాల వారి అల్లర్ల నివారణకు కవాతు నిర్వహించినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కవాతు నిర్వహించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





టీటీడీలో అధికారికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న పురోహితుడు

శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ రాజేష్‌మీనా

బీర్కూర్, మే 11: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని అమ్మవార్లను శనివారం కేంద్ర ఎన్నికల అబ్జార్వర్ ఐజీ రాజేష్ మీనా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సైతం పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల అబ్జార్వర్ రాజేష్ మీనా దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. హస్గుల్‌కు చెందిన సిద్ద రామేశ్వరయ్య, కవిత దంపతులు రూ.15 వేలు విరాళంగా అందజేసి ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

దోమకొండ, మే 11: మండల కేంద్రంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన వీధుల గుండా బైక్‌ర్యాలీ తీశారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఇందులో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దోమకొండలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మండే ఎండల్లోనూ..

జోరుగా ఉపాధి హామీ పనులు

● కామారెడ్డి జిల్లాలో 70 వేలు దాటిన ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య ● వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులపై మొగ్గు ● దినసరి కూలి రూ.300కు పెంచడంతో కూలీల్లో ఆనందం

నాగిరెడ్డిపేట, మే 11 : కామారెడ్డి జిల్లాలో మండే ఎండల్లోనూ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నా, మండే ఎండలను సైతం ఉపాధి కూలీలు లెక్క చేయకుండా పనులకు వెళుతున్నారు. అయితే ఉపాధి హామీ అధికారులు ఉపాధి హామీ పనులు ఉదయం పూటనే చేయాలని చెబుతుండటంతో ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వెళ్లి ఎండ తీవ్రత కాకముందే 10 గంటల వరకు పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల సంఖ్య 70 వేలకుపైగా చేరింది. ఈ సంఖ్య రాను రాను మరింత పెరిగే అవకాశం ఉందని ఉపాధిహామీ అధికారులు అంటున్నారు. జిల్లాలో మొత్తం జాబ్ కార్డులు 2,49,896 ఉండగా అందులో 4,78, 473 మంది కూలీలు ఉన్నారు. పనికి వచ్చే జాబ్ కార్డుల సంఖ్య 1,75,704 ఉండగా ఇందులో 2,85,150 మంది కూలీలు ఉండగా ఇందులో నుంచి ప్రస్తుతం 70,285 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. గత వారంలో జిల్లాలో 70 వేల 285 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేసినట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. అంతేకాకుండా జిల్లాలో వ్యవసాయ పనులు ముగియడంతో చాలా వరకు వ్యవసాయ వరి కోతలను వరి కోత మిషన్ల ద్వారానే రైతులు చేపడుతుండటంతో వ్యవసాయ కూలీలకు పనులు లేక వారు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతుండటంతో జిల్లాలో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.



● రాఘవపల్లి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

● రూ.300కు పెరిగిన కూలి

ఉపాధిహామీ పథకం ద్వారా పని చేస్తున్న కూలీలకు కేంద్రం దినసరి కూలిని 300 రూపాయలకు పెంచడంతో ఉపాధి కూలీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇది వరకు ఉపాధి కూలీలకు దినసరి కూలీ 272 రూపాయలు ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేది నుంచి 28 రూపాయలు పెంచి రూ.300లకు చేసింది. అంతేకాకుండా దినసరి కూలీ పెంచడంతో గ్రామాలలో పనికి వచ్చే కూలీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

● పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు

ఉపాధిహామీ కూలీలకు ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో సౌకర్యాలను అధికారులు కల్పిస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పని ప్రదేశంలో కూలీలకు నీడ కోసం షెడ్ నెట్‌లను ఏర్పాటు చేశారు. కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమకూరుస్తున్నారు. కూలీలు ఉదయం పూటనే పనులు చేసేలా ఉపాధి అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఎంపీడీవోలు కృషి చేస్తున్నారు.




పోచారం ప్రధాన కాలువలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



చీనూర్‌లో పని ప్రదేశంలో కూలీల కోసం తాత్కాలిక నీడ కోసం ఏర్పాటు చేసిన షెడ్ నెట్









గొట్టిముక్కులలో కూలీలకు పనిప్రదేశంలో ఏర్పాటు చేసిన టెంట్

పెద్దచెరువులో కట్టుకాలువ పూడికతీత

దోమకొండ, మే 11:మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఉపాధిహామీ కూలీలు పెద్ద చెరువులోని కట్టుకాలువలో పూడికతీత పనులను చేయడం జరుగుతుందని ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్ శనివారం తెలిపారు. గ్రామంలో పూర్తి స్థాయిలో కూలీలు పనులకు హాజరౌతున్నట్లు తెలిపారు. కూలీలు చేసినటువంటి పనులకు కొలతల ప్రకారం డబ్బులను వారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. కొత్తగా పనికి రావాలనే కూలీలు డిమాండ్ రాసి ఇస్తే ఆన్‌లైన్ ఎంట్రీ చేసిన అనంతరం రెండు, మూడు రోజుల్లోనే పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నమన్నారు.పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేశంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే..

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, మే 11: దేశంలో నాలుగవ విడత ఎన్నికల్లో రానుంది సంకీర్ణ ప్రభుత్వం అని, దేశంలో బీజేపీకి కేవలం 200 సీట్లు దాటవని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని దేశాయిపేట్, తాడ్కోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన బాన్సువాడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు ఏకమై సంకీర్ణ ప్రభుత్వంకు నాంది పలుకుతాయని తెలిపారు. అంతేకాకుండా బీజేపీ నినాదం సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ కాదని, కేవలం సబ్ కా సాత్ సబ్‌కా వినాష్ అన్నట్లుగా ఉందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, మేమంతా సేవకులుగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎర్వాల కృష్ణారెడ్డి, రవీందర్, పోతిరెడ్డి, ఎజాజ్ తదితరులు ఉన్నారు.

ఇందిరానగర్‌లో వ్యక్తి అదృశ్యం

కామారెడ్డి టౌన్, మే 11: కామారెడ్డి ఇందిరానగర్‌కు చెందిన భోజ పోశయ్య కనిపించకుండా పోయినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటలకు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కాలికి చికిత్సచేయించుకుని అక్కడి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపారు. అయితే, చుట్టుపక్కల వెతికిన కూడా అతని జాడ దొరకలేదని, అతని బావమరిది అయిన దేవునినర్సింలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు మిస్సింగ్‌కేసు నమోదుచేయడం జరిగిందని సీఐ తెలిపారు.

'సోనియమ్మ రుణం తీర్చుకుందాం'

బాన్సువాడ టౌన్, మే 11: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకుందామని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ వాసుల చిరకాల వాంఛను తీర్చిన సోనియమ్మకు రుణపడి ఉన్నామని, ఇపుడు ఆ రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టిన ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలలో 5 గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. రైతులు దిగాలు చెందాల్సి అవసరం లేదని, ఆగష్టు 15లోగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనర్హులకే డబుల్ ఇండ్లను అందజేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికే అందజేయనుందన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి , మోహరిల్ శ్రీనివాస్‌రావు, పాతబాలకృష్ణ, మాసాని శేఖర్‌రెడ్డి, మంత్రి గణేష్, వెంకట్‌రాంరెడ్డి, అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి





వైభవోపేతంగా అభయాంజనేయ స్వామి అభిషేకం



ధర్మారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు





వేడుకలకు ముస్తాబైన గణపతి, వేంకటేశ్వర స్వామి

డిచ్‌పల్లి, మే 11: మండలంలోని ధర్మారం(బి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో అభయ ఆంజనేయ స్వామి అభిషేకాలు, అర్చనలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో వేద బ్రాహ్మణులు నవగ్రహ వాస్తు, యోగిని క్షేత్రపాలమండపాల స్థాపన నిర్వహించారు. సాయంత్రం గణపతి సహస్ర మొదట వాహనం కార్యక్రమాలు జరిపారు. నేడు సాయంత్రం శివ పార్వతుల కల్యాణంతో పాటు శంకర జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ రావుల బ్రహ్మానందం తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యతో భక్తులు హాజరుకాలని ఆయన కోరారు. 12ఏళ్ల ఆలయ వార్షికోత్సవం సందర్భంగా దేవత మూర్తులను పలు రంగుల పూలతో సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామంలోని ప్రజలు ఈ పూజా కార్యక్రమానికి భారీ సంఖ్యలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కుర్మ సంఘం సభ్యులు



కుర్మ సంఘం సభ్యులనుకాంగ్రెస్‌లో ఆహ్వానిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

కోటగిరి,మే11: కోటగిరి మండల కేంద్రానికి చెందిన కుర్మ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి కుర్మ సంఘం సభ్యులను కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మనోహర్, నాయకులు గంగాధర్ రావు దేశాయ్, షహీద్, కలీం, మధు, భీమా సాయిరెడ్డి పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే11: మండలంలోని తొర్లికొండగ్రామంలో వేంకటేశ్వర స్వామిదేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి భక్తులు కొండపై చేరుకొని స్వామివారి పల్లకీని కొండ చుట్టూ ప్రదక్షిణ చేయించారు.అనంతరం ఆలయంలో భక్తులు, గ్రామ స్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కు లు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



విరాళాలు అందజేస్తున్న భక్తులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇందల్వాయి, మే 11: ఇందల్వాయి మండలంలోని డొంకల్ గ్రామానికి చెందిన అయిండ్ల చిన్నయ్య అనే వ్యక్తి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని అన్నారు. పేద కుటుంబాలను ఆదుకోవడంలోనే తనకు సంతృప్తి ఉందని నిరుపేదలకు తనవంతుగా సహాయం అందిస్తూ ఉంటానని అన్నారు.

14 వరకు 144సెక్షన్ అమలు

ముప్కాల్, మే11: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ముప్కాల్ మండలంలో ఆయా గ్రామాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై భాస్కరచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు వ్యక్తుల కంటే ఎక్కువ మంది గుమిగుడరాదని, పోలింగ్ స్టేషన్‌కు 200మీటర్ల దూరంలో ఉండాలని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు కాకుండా ఇతర వ్యక్తులు ఉండరాదని, ఫంక్షన్‌హాల్, కమ్యూనిటీ హాల్, గెస్ట్‌హౌజ్‌ల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉండరాదని అన్నారు. వైన్స్‌షాప్‌లు, కల్లుదుకాణాలు మూసి ఉంచాలని నిబంధనలు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఎస్సై తెలిపారు.

మా మండలంలో పెత్తనం ఏంటి!?

- గల్లీలో కొట్టుకున్న కాంగ్రెస్ నాయకులు
- ఓ సీనియర్ నాయకుడిపై చేయి చేసుకున్న నాయకుడు సంతోష్‌రెడ్డి

ఇందల్వాయి, మే 11:ఇందల్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల పెట్రోల్ బంక్ వద్ద శనివారం కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఇందల్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌రెడ్డి తన సొంత మండలంలో నీ పెత్తనం ఏంటని జక్రాన్‌పల్లి మండలానికి చెందిన సీనియర్ నాయకుడు మునిపల్లి సాయిరెడ్డిపై చేయి చేసుకోవడంతో గొడవ పెద్దదైంది. శనివారం ఇందల్వాయి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న సాయిరెడ్డిపై తన అక్కసును వెళ్లగక్కాడు. మండలంలోని మరో సీనియర్ నాయకుడికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నాడంటూ సాయిరెడ్డి వద్దకు వెళ్లి గళ్ల పట్టుకొని చొక్కా చించివేసి పిడిగుద్దుల వర్షం కురిపించాడు. వెంటనే సాయిరెడ్డి తిరగబడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువురు రోడ్డుపై కొట్టుకోవడంతో అక్కడున్న మిగతా కాంగ్రెస్ నాయకులు అవాక్కయ్యారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రచారానికి చివరి రోజు కావడంతో ఈ గొడవ ప్రభావం ఎన్నికలపై పడుతుందని మిగతా కార్యకర్తలు ఇద్దరిని సముదాయించారు. ప్రచారంలో భాగంగా ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా ఈ గొడవ చోటు చేసుకుంది. రోడ్డుపై ఇద్దరు కొట్టుకోవడంతో మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే భూపతిరెడ్డి వద్దకు చేరడంతో ఆయన ఇరువురితో మాట్లాడి సర్దిచెప్పినట్లు తెలిసింది.

ఆంధ్ర ఎన్నికలకు తరలిన భవన నిర్మాణ కార్మికులు



సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు





ఓట్లు వేయడానికి ఆంధ్రాప్రాంతానికి బయలు దేరిన భవన నిర్మాణ కార్మికులు

- నిలిచిన భవన నిర్మాణ పనులు
- ప్రయాణ చార్జీలు చెల్లిస్తున్న అభ్యర్థులు
- టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- ప్రయాణికులతో కిటకిటలాడిన ఆంధ్ర బస్సులు

సుభాష్‌నగర్,మే 11: ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 13న జరుగనుండడంతో జిల్లాలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రయాణమవుతున్నారు. జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పని నిమిత్తం అక్కడి నుంచి వస్తుంటారు. ఎన్నికల వేల ఓటు వేయడానికి ఆంధ్రకు బయలుదేరుతున్నారు. ఐదు ఏళ్లకు ఒక సారి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా ప్రయాణమవుతున్నారు.గతరెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు అంతే కాకుండా వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఓటు వేయడానికి తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు.గ్రామా గ్రామాన భవన నిర్మాణ కార్మికులు పనుల నిమిత్తం తమ నివాసాన్ని ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. గ్రామానికి పది మంది చొప్పున సుమారు జిల్లాలోని వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, ఇతరులు ఇక్కడ పని చేస్తున్నారు. ఇక్కడి భవన నిర్మాణ కార్మికులు ఆంధ్రలో తమ ఓటు హక్కు ద్వారా విజేతలను నిర్ణయంలో కీలకపాత్ర పోషించడంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆంధ్ర నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారు. ఓటర్లను ఆంధ్రకు రప్పించడానికి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

● ఓటర్లకు ప్రయాణ చార్జీలు చెల్లింపు

ఆంధ్రలో ఓటుహక్కు కలిగి ఉన్న భవన నిర్మాణ కార్మికులను ఆంధ్రకు రప్పించడానికి అక్కడి నాయకులు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటు హక్కు ఉన్న వ్యక్తుల ఫోన్‌నంబర్లను తెలుసుకుని నేరుగా ఫోన్ చేసి వారికి ప్రయాణ చార్జీలు, ఖర్చుల నిమిత్తం ఆన్‌లైన్‌లో డబ్బులను పంపిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ2వేల నుంచి రూ.4వేల వరకు చెల్లింపులు చేసి ఆంధ్రకు రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఒకే ఊరిలో ఎక్కువ మొత్తంలో ఒకే ఊరికి సంబంధించిన వ్యక్తులు ఉండడంతో వారికి రవాణ సౌదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. ప్రైవేటు వాహనాలను తీసుకుని రావాలని వాటికి కావలసిన డబ్బులు చెల్లిస్తామని మాటిస్తున్నారు. ఇప్పటికే చాల మందికి డబ్బులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంతో వారు వారి స్వగ్రామాలకు పయనమయ్యారు.

● ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు సంస్థ ఆంధ్ర ఓటర్ల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వారిని ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చేర్చడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వివిధ రూట్లను బస్సులను నడుపనుంది. సుమారు 20కు పైగా బస్సులను ఏర్పాటు చేసి వారి గమ్యస్థానాలకు చేర్చుతుంది. గురువారం నిజామాబాద్ నుంచి వైజాగ్, అమలాపురం, ఆర్మూర్ నుంచి ఉదయగిరి, తదితర ప్రాంతాలకు బస్సులను నడుపుతుంది. 11న నిజామాబాద్ నుంచి ఉదయగిరి, రాజమండ్రి, ఆర్మూర్ నుంచి ఏలూరు, ఉదయగిరి, బాన్సువాడ నుంచి పోలవరం, బోధన్ నుంచి అమలపురం, ఏలూరు, ఆర్మూర్ నుంచి ఉదయగిరి, ఏలూరు బస్సులను నడుపనుంది. 12న నిజామాబాద్ నుంచి కాకినాడ,ఉదయగిరి,కామారెడ్డి నుంచి పోలవరం, బోధన్ నుంచి కనిగిరి, ఆర్మూర్ నుంచి ఉదయగిరి బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

● నిలిచిన భవన నిర్మాణ పనులు

భవననిర్మాణానికి అవసరమయ్యే కూలీలు మొత్తం ఆంధ్ర నుంచి జిల్లాకు పని చేయడానికి వస్తుంటారు. తెలంగాణకు చెందిన కార్మికులు భవన నిర్మాణంలో తక్కువగా ఉండడంతో మొత్తం ఆంధ్ర కార్మికులపైనే ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరంతా ఆంధ్రకు తరలి వెళ్లడంతో నిర్మాణ పనులు నిలచిపోయాయి. గత రెండు రోజులుగా ఒక్కోక్కరుగా ఆంధ్రకు తరలి వెళ్లడంతో నిర్మాణాలు ఆగిపోయా యి. ఎన్నికల అనంతరం తిరిగి వచ్చిన తర్వాతనే మళ్లీ నిర్మాణ రంగం పుంజుకుంటుంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, మే11: మున్సిపల్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. శుక్రవారం మామిడిపల్లి, పెర్కిట్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకొని ఓటర్ల సౌకర్యార్థం టెంట్లు, పోలింగ్ సిబ్బంది గదిలో కూలర్‌లను ఏర్పాటు చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు, సానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్, సీనియర్ అసిస్టెంట్ సలీం, మున్సిపల్ సిబ్బంది, పాల్గొ న్నారు.

అర్గుల్‌లో పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సతీష్‌కుమార్

జక్రాన్‌పల్లి, మే11: మండలంలోని గ్రామాలలో పోలింగ్ బూత్‌లను శనివారం అధికారులు పరిశీలించారు. అర్గుల్‌లో ఎంపీడీవో సతీష్‌కుమార్ పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటర్లకు సౌకర్యాల విషయమై అడిగితెలుసుకున్నారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల ఉన్న దృష్ట్యా అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సిబ్బందికి, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు పోలింగ్ బూత్‌ల ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట అర్గుల్ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోటగిరి,మే11: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన భీంరావు తన ద్విచక్ర వాహనంపై శుక్రవారం సాలూర మండలం మందర్నా గ్రామంలో తన అత్తగారింటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం సంభవించింది. పొతంగల్ చెక్‌పోస్టు వద్ద నస్రుల్లాబాద్‌కు చెందిన కారు భీంరావు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి మారుతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,మే11: నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బ్రహ్మణ్‌గావ్‌కు చెందిన చించలం తిరుపతి(39)అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.శుక్రవారం ఉదయం మాక్లూర్ మండలం చిక్లీలో ఉన్న తన అత్తగారింటికి తిరుపతి వెళ్లాడని, తిరిగి అదేరోజు సాయంత్రం బైక్‌పై తన స్వగ్రామానికి వెళ్తుండగా జన్నేపల్లి క్రాసింగ్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే బాధితుడిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల కవాతు

మోర్తాడ్, మే11: మండల కేంద్రంలో పోలీసులు భారీ కవాతును నిర్వహించారు. భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు నుంచి ప్రధాన వీధులగుండా కవాతు నిర్వహించారు.

నవీపేట: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పలు వీధులలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఎన్నికలలో తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.

ఏర్గట్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో పోలీసుల కవాతు నిర్వహించారు.సీఐ ఆంజనేయులు, ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్గట్ల పోలీసులతో కలిసి పలు వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా కమిషన్ ఆదే శాల మేరకు కవాతు నిర్వహించామని, చట్ట విరుద్ధమైన కార్యాక్రమాల సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

కమ్మర్‌పల్లి: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శనివారం మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. కవాతులో ఆర్మూర్ ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ ఆర్.రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రెంజల్: మండలంలోని సమస్యాత్మక ప్రాంతమైన నీలా గ్రామంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యగా పోలీసుల కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సాయన్న, కేంద్ర, రాష్ట్ర బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు ధర్పల్లి సీఐ బిక్షపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గల సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు మండల కేంద్రంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వ హించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కో వాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లు ఏలాంటి భయాందోళన అవసరం లేదని, ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. సర్కిట్ పరిధిలో 17సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఈ కేం ద్రాలలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ ముగిసేంత వరకు సర్కిట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. స్థానికేతరులు సర్కిల్ పరిధిలో ఉండ రాదని తమతమ గ్రామాలకు వెళ్ళిపోవాలని సూచించారు. పోలింగ్‌బూత్‌ల వద్ద 100మీటర్ల లోపు ఓటర్లు మాత్రమే అనుమతి ఉంటుందని సీఐ చెప్పారు. 135మంది సిబ్బందితో ఎన్నికల బందోబస్తు ఏర్పాటు చేశామ న్నారు. ఎక్కడ ఏలాంటి అవతరాలు ఎదురైన తమ సిబ్బంది చేరుకుంటా రని తెలిపారు. సర్కిల్‌లో 78పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, పది రోడ్ మొబైల్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ధర్పల్లి, సిరికొండ మండలాల ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.



ఏర్గట్లలో కవాతులో పాల్గొన్న పోలీసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

మద్నూర్, మే 11: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు జుక్కల్ శాసన సభ్యుడు తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. శనివారం ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌కు మద్దతుగా పెద్ద ఎక్లారా, కొడిచిర, ఆవాల్‌గాం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనేనని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అబద్దాల హామీతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో సురేష్ శెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ గూటికి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

సదాశివనగర్, మే 11: సదాశివనగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కండువాకప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండడం అభివృద్ధిలో మునుపెన్నడూ లేనివిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఏర్పాటు కాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంట్లో గొడవ పడి పసి బిడ్డతో మహిళ అదృశ్యం



అదృశ్యమైన సంధ్య

ఎల్లారెడ్డి, మే 11: మండలంలోని రుద్రారం గ్రామంలో అత్త కోడలు గొడవ పడి కోడలు తన కొడుకు 15 నెలల బాలుడుతో ఇంటి నుంచి అదృశ్యం అయిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్ల పద్మ, సాయిలు సంగారెడ్డి జిల్లాలోని సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు గ్రామానికి చెందిన వీరికి ఒక కూతురు ఒక కొడుకు ఇద్దరు సంతానం. కాగా కూతురు వడ్ల సంధ్యను ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కమ్మరి ప్రశాంత్‌తో వివాహం జరిపించారు. వీరికి ఒక బాబు. శుక్రవారం అత్త లక్ష్మీతో కోడలు సంధ్య గొడవ పడి కనిపించకుండా పోవడంతో ఈ సమాచారాన్ని కమ్మరి సంధ్య తల్లి దండ్రులకు ఫోన్లో తెలియజేయడంతో వచ్చి వెతికి చుట్టుపక్కల వారిని విచారించగా శుక్రవారం 12 గంటలకు వడ్ల సంధ్య తన కుమారుడు చైతన్య 15 నెలల బాబును తీసుకొని ఇంటి నుంచి అదృష్టమైనట్లు తెలిసింది. దాంతో ఆమె ఇంటి నుంచి వెళ్లేటప్పుడు చీరతో ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందని, ఎత్తు అయిదు అడుగుల రెండు అంగుళాలు ఉంటుందని ఆమె తెలుగు చక్కగా మాట్లాడుతుందని ఆమె వద్ద మొబైల్ ఫోను లేదని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో తెలియజేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో శవం లభ్యం

ఎల్లారెడ్డి, మే 11: మండలంలోని మత్తమాల గ్రామ శివారు ప్రాంతంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి శవం శనివారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి వయసు 40-45 సంవత్సరాలు ఉంటాయని మృతుడు ధరించిన బ్లూ కలర్ షర్ట్, లుంగీ కలదని అన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఎవరైనా కనిపించకుండా ఎవరైనా మిస్ అయిన వాళ్ళు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తూ.. అనంత లోకాలకు

● చెట్టుకు బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, మే 11: తమ సమీప బంధువుల అంత్యక్రియలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఎరుకల దుర్గయ్య(40) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని రామక్కపల్లి గేట్ సమీపంలో బోధన్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలానికి చెందిన ఎరుకల దుర్గయ్య అనే వ్యక్తి ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో తమ సమీప బంధువు అంత్యక్రియలకు ద్విచక్ర వాహనంపై ఎరుకల దుర్గయ్య వస్తుండగా నాగిరెడ్డిపేట మండలంలోని రామక్కపల్లి గేట్ సమీపంలో ఉన్న చెట్టుకు బైక్ బలంగా ఢీకొట్టి కింద పడటంతో దుర్గయ్య తల బండరాయికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఎరుకల నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

బోరు మోటార్ల విద్యుత్ తీగల చోరీ

బీర్కూర్, మే 11: మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ భూముల్లో గల బోరు మోటార్ల విద్యుత్ వైర్లను దొంగిలించినట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటప్పయ్య శివారు నుంచి మంజీరా నది వరకు గల 40 మంది రైతుల పంట పొలాల్లో బోరు మోటార్ల విద్యుత్ వైర్లను దొంగిలించినట్లు తెలిపారు. మార్కెట్‌లో రాగి ధర ఎక్కువ ఉండటంతో దొంగల కన్ను బోరు మోటార్ల విద్యుత్ వైర్లపై పడిందన్నారు. విద్యుత్ స్తంభం నుంచి బోరు లోపల వరకు విద్యుత్ కనెక్షన్ ఉండటంతో దొంగలు వైర్లను కట్ చేసి దొంగిలించుకుని వెళ్లారని రైతులు తెలిపారు. వైర్ల పైనున్న కేబుల్ తొలగించి రాగి వెలికి తీసి మార్కెట్‌లో విక్రయించుకుంటారన్నారు. పోలీసులు దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.



కామారెడ్డి కార్నర్ మీటింగ్‌కు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు



మాట్లాడుతున్న ప్రియాంకగాంధీ, పక్కన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్



రోడ్‌షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

కామారెడ్డి, మే 11 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్, రోడ్‌షోకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమాలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిలకు కాంగ్రెస్ శ్రేణులు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా జేపీఎన్ రోడ్డు వరకు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించి ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిలు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్‌షో, కార్నర్ మీటింగ్ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిల పర్యటన సైడ్‌లైట్స్

- 5.38 నిమిషాలకు కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిల హెలిప్యాడ్ ల్యాండ్ అయింది
- ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డిలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌లు స్వాగతం పలికారు
- 5.40కి ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు చేరుకుని అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించారు
- 5.42కు జేపీఎన్ చౌరస్తాకు రోడ్‌షో చేరుకుంది. కార్నర్ మీటింగ్ నిర్వహించారు
- 5.43కు ప్రియాంకగాంధీ ప్రసంగించారు
- 5.52కు ప్రియాంక గాంధీ ప్రసంగం ముగిసింది. సుమారు 9 నిమిషాల పాటు ప్రసంగించారు
- 5.52 నిమిషాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి 5.55కు ముగించారు
- 6 గంటలకు ప్రియాంకగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు హెలిప్యాడ్‌లో తిరుగు ప్రయాణం అయ్యారు
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి పోలీస్ బలగాలను మోహరించారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

- మూగబోయిన మైకులు
- జిల్లాలో ముగిసిన ఎన్నికల ప్రచారం
- చివరి రోజు పోటా పోటీగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, బైక్ ర్యాలీలు
- పట్టణాల్లో, పల్లెల్లో హోరెత్తిన ప్రచారం
- అన్ని పార్టీల తరపున ప్రచారం చేసిన ముఖ్యనేతలు
- భారీగా హాజరవుతూ వచ్చిన జనం

కామారెడ్డి టౌన్, మే 11: జిల్లాలో గత రెండు నెలల నుంచి ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్మోగిన మైక్‌లు మూగబోయాయి. బ్యాండ్ బాజాలు బంద్ అయ్యాయి. ఎన్నికల ప్రచార వాహనాలను ఫ్లెక్సీలను మైక్‌లను తొలగించారు. ప్రచారానికి అభ్యర్థులు సైతం ప్యాకప్ చెప్పారు. చివరి రోజు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పార్టీల అభ్యర్థులు, నాయకులు పోటా పోటీగా రోడ్డుషోలు, సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి ఈనెల 13న పోలింగ్ జరుగనుంది. ఈ నియోజకవర్గాల్లో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. శనివారం ప్రచారం ముగియడంతో ఎవరికి ఎన్ని ఓట్లు పడుతాయనే దానిపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి జిల్లాలో ప్రధాన పార్టీలకు చెందిన ముఖ్యనేతలు వారి వారి అభ్యరుల్థ తరుపున ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు.

మూగబోయిన మైక్‌లు

ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోని పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో గల్లీ గల్లినా ఎక్కడ చూసినా మైక్‌ల మోతలు, బ్యాండ్ బాజాలతో ఆయా పార్టీల అభ్యర్థులు, వారి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని గత కొన్ని రోజులుగా హోరెత్తిస్తూ వచ్చారు. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు వారి వారి ప్రచార వాహనాలతో పల్లెపల్లెన వెళ్లి జోరుగా ప్రచారం కొనసాగించారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ వచ్చారు. గ్రామాల్లో ఇంటి ఇంటికీ వెళుతూ తాము గెలిస్తే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామంటూ ఆయా పార్టీల నేతలు హామీల వర్షాలు కురిపిస్తూ వచ్చారు.

ప్రచారాలతో హోరెత్తించిన పార్టీలు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి జిల్లాలో ఆయా పార్టీలు ఎన్నికల ప్రచారాలతో హోరెత్తించాయి. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కానీ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. వీరు గత 15 రోజులుగా పోటా పోటీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ వచ్చారు. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున సురేష్‌షెట్కార్ బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి ఎంపీ బీబీ పాటిల్‌లు పోటీ చేస్తుండటంతో ఎంపీ సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో తమదే గెలుపు అంటూ ఆ స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించామని ప్రజలు తమ వైపే మొగ్గు చూపుతున్నారంటు అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



మిగిలింది పోలింగ్, కౌంటింగ్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచార పర్వాల ఘట్టం ముగియడంతో కేవలం పోలింగ్, కౌంటింగ్ మిగిలి ఉంది. ఈ నెల 13న జిల్లాలో జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి పోలింగ్ జరుగనుంది. నిన్నటి వరకు ఎన్నికల ప్రచారాలతో క్షణం తీరిక లేకుండా బీజీబీజీగా గడిపిన ఆయా పార్టీల అభ్యర్థులు పోలింగ్‌పై దృష్టి సారించారు. ప్రధాన ఘట్టం అయిన ఎన్నికల పోలింగ్‌కు జిల్లా అధికారులు సైతం సిద్ధమయ్యారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న కామారెడ్డి జిల్లాలో మొత్తం 913 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగేందుకు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించి ఓటింగ్ యంత్రాలతో అక్కడికి వెళ్లేలా వాహన సదుపాయం సైతం కల్పిస్తున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓట్లు 6,80,921 ఉన్నాయి. వంద శాతం పోలింగ్ అయ్యేలా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికలు దేశ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో దశల వారిగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. నాలుగో దశలో తెలంగాణ రాష్ట్రానికి ఎన్నికలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయిన తర్వాతనే ఓట్ల లెక్కింపు చేపట్టనుంది. ఓట్ల లెక్కింపు మాత్రం జూన్ 4న జరగనుంది. దాదాపు ఫలితాల కోసం అభ్యర్థులు 23 రోజులు వేచి చూడాల్సిందే.

ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటువేయాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డిటౌన్, మే11: 13న జరిగే లోక్‌సభ పోలింగ్‌కు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటువేయుటకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఓటర్లు వందశాతం పోలింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. జిల్లాలో 6,80,921 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,28,879మంది పురుషులు, 3,52,012 మహిళలు, 30 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ఇందులో 20,962 మంది యువ ఓటర్లు, 3,865మంది సీనియర్ సిటిజన్లు, 16,503మంది దివ్యాంగులున్నారని వివరించారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 913 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. 64 సమస్యాత్మక లోకేషన్లలో 183 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రత చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం 64మంది సూక్ష్మపరిశీలకులను నియమించామని తెలిపారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి 1977 బ్యాలెట్ యూనిట్లు, 987కంట్రోల్ యూనిట్లు, 1107 వీవీ ప్యాట్‌లను ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని 94రూట్ల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఏడుచొప్పున మోడల్ పోలింగ్ స్టేషన్లను, 5 మహిళా పోలింగ్‌స్టేషన్లను, ఒక్కో యూత్, దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ ఇద్దరు ఇతర పోలింగ్ సిబ్బందితో కూడిన పోలింగ్ బృందాలను ఏర్పాటుచేసి 3విడతలుగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. 4,460 పోలింగ్ సిబ్బందిని, 1600మంది పోలీసు సిబ్బందిని, శాంతిభద్రతల పర్యవేక్షణకు 4కంపెనీల పోలీసుబలగాలను మోహరించామన్నారు. పోలింగ్‌కు ఇంకా కొన్నిగంటల సమయమే ఉన్న ఈ 48గంటల నిశ్శబ్దకాలంలో ఎన్నికల ప్రవర్తనా నియామవళిని కచ్చితంగా అమలు చేయుటకు అన్ని బృందాలను అప్రమత్తం చేశామని, ఓటర్లను ప్రలోభ పెట్టె డబ్బు, మద్యం, విలువైన బహుమతులు రవాణాను అరికట్టేందుకు అంతర్‌రాష్ట్ర, జిల్లా సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచామని తెలిపారు. ఇప్పటివరకు కోటీ 92లక్షల డబ్బు, 15లక్షల 85వేల విలువ గల 7,045 లీటర్ల మద్యం, 16లక్షల 50వేల విలువ గల గంజాయి, బంగారం పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగేపోలింగ్‌కు ఎన్నికల సంఘం గుర్తించిన 12 గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదానితో వచ్చి తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, సెల్‌ఫోన్ అనుమతి లేదని కలెక్టర్ తెలిపారు.

● సాయంత్రం 6 గంటల నుంచి నిషేధం అమలు

లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసిందని, శనివారం సాయంత్రం 6 గంటల నుంచి నిషేధం అమలులోకి వచ్చిందని, ఎన్నికలు ముగిసేవరకు జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఎటువంటి సభలు, సమావేశాలు, నిర్వహించడం నిషేధమని, ఐదుగురికి మించి ఒకేచోట గూమిగూడొద్దని చెప్పారు. 48గంటల సైలెన్స్‌పీరియడ్ దృష్ట్యా జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండకూడదని స్పష్టంచేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌లు తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సెక్షన్ 126(1)(బీ) ఆర్‌పీ యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్‌పోల్స్ నిషేధమని, ఫలానా అభ్యర్థి గెలువబోతున్నారని కూడా ప్రసారం చేయరాదని కలెక్టర్ తెలిపారు.

● ఎన్నికలు ముగిసేవరకు సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

కామారెడ్డిటౌన్: ఎన్నికలు ముగిసేవరకు ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని కలెక్టర్ జితేష్‌వి.పాటిల్ తెలిపారు. శనివారం ఎస్పీ సింధూశర్మ, ట్రైని ఎస్పీ కాజల్‌తో కలిసి 48 గంటల నిశ్శబ్దకాలంలో చేయాల్సిన, చేయకూడని అంశాలను వివరించారు. డబ్బు, మద్యం విలువైన బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేయడం సెక్షన్171 ప్రకారం నేరమని, వాటినిరోధానికి ఎస్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టామని అన్నారు. ఏదైనా తమ దృష్టికివస్తే సీవిజిల్ ద్వారా లేదా 1950ద్వారా సమాచారమందించాలని కోరారు. పోలింగ్‌కేంద్రానికి మొబైల్ ఫోన్ అనుమతి లేదని అన్నారు. ప్రజాప్రతినిధ్య చట్టం 1951 చట్టంలోని 126 సెక్షన్ ప్రకారం పుట్టినరోజు, తదితర ఉత్సవ కార్యక్రమాల్లో ఎటువంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టరాదని, అదేవిధంగా సెక్షన్ 126(1)(బీ) ఆర్‌పీ యాక్ట్ 1951 ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు వేయడం, ప్రసారం చేయడం నేరమన్నారు. తెలిపారు. పోలింగ్‌కేంద్రాలలో షామియానా, మంచి నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని, వృద్ధులు దివ్యాంగులకు ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు వాహనసౌకర్యం కల్పిస్తున్నామని, వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాహన సౌకర్యం కల్పిస్తున్నామని, 12 రకాల గుర్తింపుకార్డులో ఏదైనా ఒకటి తేవాలని సూచించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లలో ఎటువంటి సందేహం అవసరం లేదని, ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీలు ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించి ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభిస్తామని అన్నారు. ఈవీఎంల సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే సమీపంలోని సెక్టోరల్ అధికారులు రీప్లేస్ చేసేతారని అన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ సైలెన్స్ పీరియాడ్‌లో ఇతర నియోజకవర్గ ప్రజలు ఎవరూ ఉండొద్దని, హోటల్స్, లాడ్జిలు, తదితర వాటిని క్షుణంగా తనిఖీ చేస్తామని అన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని, ఐదుగురి కంటే ఎక్కువ గూమిగూడొద్దని తెలిపారు. మద్యం రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టామని, మీ దృష్టికి వస్తే సీవిజిల్ ద్వారా తెలపాలని కోరారు. ఓటర్లను వాహనాలు చేరవేయడం, పోలింగ్ కేంద్రాలకు మొబైల్ తీసుకురావడం నిషిద్ధమని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు కోటి 91లక్షల నగదుతో పాటు 6790లీటర్ల మద్యం పట్టుకుని కేసులు నమోదు చేశామని అన్నారు. గత శాసనసభలో రౌడిషిటర్లతో పాటు కొత్తగా 583 మందిని బైండోవర్ చేశామని అన్నారు.

● ఈవీఎం డిస్ట్రి బ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక జీవధాన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల ఈవీఎం డిస్రిబ్యూషన్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ జితేష్ విపాటిల్ పరిశీలించారు. అనంతరం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌తో మాట్లాడారు. డిస్టిబ్యూషన్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మహేందర్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి

మద్నూర్: 13న సోమవారం జరిగే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి అందించే మద్నూర్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సందర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై జుక్కల్ నియోజకవర్గం సెగ్మెంట్ అసిస్టెంట్ అధికారి శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఎన్నికల సామాగ్రి అందించే రోజు, పోలింగ్ అయిన రోజు సాయంత్రం పోలింగ్ సిబ్బందికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు.

గ్రామాల్లో బీజేపీ నాయకుల ఎన్నికల ప్రచారం

నసురుల్లాబాద్, మే11: నసురుల్లాబాద్ మండలం అంకోల్ తండా, మండలంలోని సున్నం సాయిలు, మండల నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు వివరించారు. నరేంద్రమోదితోనే దేశఅభివృద్ధి, గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమలో బీజేపీ సీనియర్ నాయకులు గంగాధర్ గుప్త, శ్రీనివాస్‌రావు, కంది పెద్ద మల్లేష్, యాదగిరిగౌడ్, పెరిక రాములు, మండల నాయకులు ఉన్నారు.

బీబీపేటలో..

బీబీపేట: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు దేశం కోసం, మోదీ కోసం కమలం పువ్వుగుర్తుకు ఓటు వేయాలని నినాదిస్తూ బీజేపీ నాయకులు ప్రధాన వీధులగుండా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు పోన్నాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సోమవారం జరిగే ఎన్నికలలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించి, దేశంకోసం ధర్మంకోసం పనిచేసే మోదీని మరోసారి ప్రధానమంత్రిని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్,బీజేవైయం మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు శ్రీనివాస్,భరత్‌రాజ్, దేవరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో బైక్ ర్యాలీ

తాడ్వాయి: మండలంలో శనివారం బీజేపీనాయకులు భారీబైక్‌ర్యాలీ నిర్వహించారు. మండలంలోని నందివాడ, ఎర్రపహాడ్, దేమికలాన్ గ్రామాల్లోర్యాలీ కొనసాగించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరోసారి నరేంద్రమోదీ ప్రధాని అయితే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్‌రెడ్డి, వెంకట్‌రావు, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉగ్రవాయిరాజు, ప్రణయ్‌రెడ్డి,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	కింగ్‌డమ్ ఆఫ్‌ది ఆప్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	క్రిష్ణమ్మ
ప్రియా 35	ప్రతినిధి-2

బాన్సువాడ	
మహేశ్వరి	బాక్
వెంకటేశ్వర	కృష్ణమ్మ

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

